క్లుప్తంగా

భద్రావతి భావనారుషీశ్వరులకు ప్రత్యేక పూజలు



స్వాములకు పూజలు చేస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డు సమీపంలోని మార్కండేయస్వామి ఆలయంలో భద్రావతి భావనారుషీశ్వర స్వాముల కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో బహూత్తమ పద్మశాలియ సంఘం అధ్యక్షుడు గడ్డం గణేష్, వైస్ ప్రెసిడెంట్స్ రంగప్రసాద్, రవికుమార్, జాయింట్ సెక్రటరీ గడ్డం పరమేష్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి హరికృష్ణ, సభ్యులు రవికుమార్, శివశంకర్, భక్తులు పాల్గొన్నారు.

కవి కేశవరెడ్డికి సన్మానం



కవి నందవరం కేశవరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: స్థానిక టీచర్స్‌కాలనీలోని పెన్షనర్స్ భవనంలో ఆదివారం విశ్రాంత తెలుగు అధ్యాపకుడు, కవి నందవరం కేశవరెడ్డిని సన్మానించారు. కాంతి పూలు అనే పుస్తకాన్ని కవి కేశవరెడ్డి ఇటీవల రాశారు. ఈనేపథ్యంలో సీనియర్ న్యాయవాది రమేష్‌నాథరెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఏడీసీసీబీ మాజీ చైర్మన్



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏడీసీసీబీ మాజీ చైర్మన్ తరిమెల కోనారెడ్డి

శింగనమల: జిల్లా ఇంచార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తరిమెల కోనారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం జిల్లాకు వచ్చిన మంత్రిని కలిసి నియోజకవర్గ రాజకీయ అంశాలపై చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

19న మండల సర్వసభ్య సమావేశం

పుట్లూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 19న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

దళిత చైతన్యయాత్ర విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: దళితుల హక్కుల సాధన కోసం చేపడుతున్న దళిత చైతన్య యాత్రను విజయవంతం చేయాలని రాయలసీమ దళిత సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద దళిత చైతన్య యాత్ర కరపత్రాలను వారు విడుదల చేశారు. దళితులను చైతన్య పరచడమే లక్ష్యంగా జూన్ 25 నుంచి రాయలసీమ జిల్లాల్లో యాత్ర తలపెట్టామని రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో దళితులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శింగనమల ఎస్‌ఐగా బాలకృష్ణయ్య



శింగనమల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా బాలకృష్ణయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు పెద్దవడుగూరుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. విజిలెన్స్‌లో పని చేస్తున్న బాలకృష్ణయ్యను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈసందర్భంగా కొత్త ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా హనుమద్ జయంతి

గుంతకల్లు రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో ఆలయ పురవీధులు పోటెత్తాయి. కసాపురంలో ఐదు రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి విశేష పుష్పాలంకరణ, తోమాల సేవ, స్వర్ణ వజ్రకవచ ఆలంకరణలో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ యాగశాలలో సీతారమచంద్రస్వామివార్ల పట్టాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో ప్రత్యేక హోమాలను నిర్వహించిన వేదపండితులు పూర్ణాహుతితో హనుమజ్జయంతి వేడుకలను ముగించారు. సాయంత్రం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని ఒంటె వాహనంపై కొలువదీర్చి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక పుష్పాలతోపాటు, స్వర్ణ వజ్రకవచ అలంకరణలో దర్శనమిస్తున్న నెట్టికంటుడు



ఎమ్మెల్యే వైవీఆర్‌కు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

ఘనంగా హనుమద్ జయంతి

బుక్కరాయసముద్రం: మండలవ్యాప్తంగా ఆదివారం హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రధానంగా కొట్టాపల్లి, రెడ్డిపల్లి, రేగడి కొత్తూరు, బీకేఎస్, సిద్ధరాంపురం, చెన్నంపల్లి, బొమ్మలాటపల్లోని అంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు.

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో స్వామి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. కొట్టాలపల్లిలో అభయాంజనేయ స్వామి వెండికవచంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పామిడి: మండలంలో ఆదివారం హనుమద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక కోట ఆంజనేయులు, దత్తాత్రేయ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పఠించారు. కోట ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, బీసీ నాయకుడు జోజోడే కుమార్ స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దత్తాత్రేయాలయంలో అభయాంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఎద్దులపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో గణపతి పూజ, హోమంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేపట్టారు.

పెద్దవడుగూరు : మండలంలోని మల్లేనిపల్లి, కోటకొండ, పెద్దవడుగూరు, రాంపురం, దిమ్మగుడి తదితర గ్రామాల్లో ఆదివారం హనుమద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందదర్భంగా అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో స్వామి వారి ప్రతిమలను వాహనాలపై పెట్టుకొని ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. మల్లేనిపల్లిలో ఆంజనేయస్వామి రథోత్సవం కనుల పండుగగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కాయ కర్పూరాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఆలయ నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

తాడిపత్రి టౌన్: పట్టణంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమద్ విగ్రహాలకు జలాభిషేకం, క్షీరాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. హనుమద్ హోమం, ఆకుపూజ, కుంకుమార్చన, వడమాలతో స్వామికి భక్తులు పూజలు నిర్వహించారు. పట్టణంలోని పంచముఖ ఆంజనేయస్వామి, పుట్లూరు రోడ్డులోని వీరాంజనేయస్వామి, ఏటిగడ్డ ఆంజనేయస్వామి, నందలపాడు, కడప రోడ్డు, నంద్యాల రోడ్డు, సంజీవనగర్ తోపాటు పలు ప్రాంతాల్లో హనుమద్ జయంతి వేడుకలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యల్లనూరు: యల్లనూరు, చిలమకూరు, బుక్కాపురం, తిమ్మంపల్లి, చింతకాయమందలో ఆదివారం హనుమద్ జయంతి సందర్భంగా స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున నుంచి రాత్రి వరకు అర్చనలు, అభిషేకాలు, అన్నదానం జరిగాయి. ఆంజనేయస్వామి దర్శనం కోసం భక్తులు బారులుదీరారు.

యాడికి: మండల కేంద్రంలోని చింతవనం ఆంజనేయ స్వామి, పెద్దపేట సంజీవరాయ స్వామి ఆలయం, రాయలచెరువులో చందన గేట్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి, చందనలో ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఆదివారం హనుమద్ జయంతి ఘనంగా నిర్వహించారు. పెద్దపేట సంజీవరాయ ఆలయానికి తాడిపత్రికి చెందిన అన్నం లోకేష్ రూ.16వేల విలువ చేసే బీరువాను వితరణ చేశారు. రాయలచెరువు, యాడికి చింతవనం ఆంజనేయ స్వామి దేవాలయాల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో నిర్వాహకులు భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.

గుత్తి: పట్టంలోని పులిగుట్ట ఆంజనేయస్వామి, కాల్వగడ్డ ఆంజనేయస్వామి, చెరువు కట్ట ఆంజనేయ స్వామి, కోట ఆంజనేయస్వామి , కందకం ఆంజనేయ స్వామి, దిడ్డికుంట ఆంజనేయస్వామి ఆలయాలు, గుత్తి ఆర్ఎస్‌లోని నవరూప అభయాంజనేయస్వామి దేవాలయం, పత్తికొండ రోడ్డు ఆంజనేయస్వామి, ఎస్ ఎస్ పల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆంజనేయస్వాముల మూల విరాట్‌లకు ప్రత్యేకంగా అలంకరణలు చేసి విశేష పూజలు చేపట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గార్లదిన్నె: ముకుందాపురం, కల్లూరు, మర్తాడు, పెనకచెర్ల డ్యాం, బూదేడు, కృష్ణాపురం, పాపినేపాళ్యంలో ఆదివారం ఆధ్వర్యంలో హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నార్పల: మండల కేంద్రంలోని పాత ఆంజనేయ స్వామి, తుంపెర ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులు స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు. ఆయా ఆలయాల నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

నెట్టికంటుడి సన్నిధిలో ఎమ్మెల్యే

గుంతకల్లు రూరల్: హనుమజ్జయంతిని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వాయుడిని ఆదివారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వేకువజామునే ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే వైవీఆర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను, పట్టువస్త్రాలను అందజేశారు. స్వామివారి దర్శనానంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.



పామిడి: కోట వరాంజనేయస్వామిని పూజిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తాడిపత్రి టౌన్: వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమద్ హోమం చేస్తున్న అర్చకులు



పెద్దవడుగూరులో ఆంజనేయుడికి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



కసాపురంలో సీతారామచంద్రస్వామి పట్టాభిషేకాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంట గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

ఎమ్మెల్యే సొంతడబ్బుతో రోడ్డు నిర్మాణం



లేఔట్‌లో రోడ్డు వేసిన దృశ్యం

తాడిపత్రి టౌన్: చిన్న పొలమడ గ్రామ పంచాయితీ పరిధిలో జగనన్న లే ఔట్‌లో సొంత డబ్బుతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బీఎల్ఓ, విశ్రాంత ఆర్మీ, సివిల్ సప్లయీస్ గోడౌన్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. ఇటీవల కొందరు లబ్ధిదారులు లే ఔట్‌లో రోడ్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సొంత డబ్బు వెచ్చించి రోడ్డు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పనితీరుపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: రజాపురం గ్రామ శివారులో బైక్‌పై నుంచి పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. గుంతకల్లు మండలం శంకరబండకు చెందిన అశోక్ శనివారం అర్ధరాత్రి బంధువుల వివాహానికి గుత్తికి వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. రజాపురం శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పికిందపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్‌ను 108 వాహనం ద్వారా గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీనారాయణుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: కసాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సందర్శించారు. ఆలయంలో 8.6 అడుగుల ఎత్తుతో ఉన్న ఏకశిలా ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం, 9.9 అడుగుల ఎత్తుతో పరశురామస్వామి విగ్రహం, 8.4 అడుగుల ఎత్తుతో గరుత్మంతుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే స్వామి వార్లకు పూజలు చేయించారు. ఆలయ నిర్మాణకర్త తలారి పరశురాముడు దంపతులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

గార్లదిన్నె: వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం డ్రాయింగ్, కథలు పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ అధికారిణి శిరీష మాట్లాడుతూ గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా విద్యార్థులకు అనేక రకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి

యల్లనూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలని ఎస్‌ఐ రామకృష్ణ సూచించారు. ఆదివారం ఆయన యల్లనూరు, పెద్దమల్లేపల్లి, నిట్టూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవనం సాగించాలన్నారు. ఫ్యాక్షన్‌తో కుటుంబాలు సర్వనాశనమవుతాయన్నారు.

• సన్మానం



అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లిలోని రిసార్ట్స్‌లో సన్మానం పొందిన జేసీఎస్ కన్వీనర్లతో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



కొత్తపల్లెలో స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: మండలంలోని భోగాలకట్ట, కొత్తపల్లె గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించారు. ముందుగా భోగాలకట్ట గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దూదేకుల రసూల్ కుమారుడు దూదేకుల మహబూబ్ భాష, కైరూల్ వివాహానికి తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అంతకు మునుపు గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం తూట్రాళ్ల పల్లె పంచాయతీలోని కొత్తపల్లెలో వెంకటప్ప ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో తూట్రాళ్లపల్లె సర్పంచు సంజీవరాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత భోగాతి బ్రహ్మానందరెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, గుత్రి శ్రీనాథ్, చితంబరయ్య, పుల్లయ్య, కేశవ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీకి రిజిస్ట్రేషన్లు

గుత్తి రూరల్: ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ పంపిణీ కోసం సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నట్లు ఏఓ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 15 రైతు భరోసా కేంద్రాలలో విత్తన వేరుశనగ పంపిణీ ఉంటుందని ఏఓ తెలిపారు. ప్రభుత్వం ద్వారా 40 శాతం రాయితీలో విత్తనాలను రైతులకు అందిస్తామన్నారు. క6 రకం విత్తన వేరుశనగ క్వింటా ధర రూ.9,300 కాగా 40 శాతం రాయితీతో రైతుకు రూ.5,580, కె-1812 లేపాక్షి రకం క్వింటా ధర రూ.8,300 కాగా సబ్సిడీతో రైతుకు రూ.4,980కి అందిస్తామన్నారు. అర ఎకరా భూమి ఉన్న రైతుకు ఒక బస్తా, ఎకరాకు రెండు బస్తాలు, ఎకరా పైన భూమి ఉన్న రైతులకు మూడు బస్తాలను అందిస్తామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సూచించారు.

ఆకట్టుకున్న తాళాల భజన పోటీలు

గార్లదిన్నె: ముకుందాపురంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి తాళాల భజన పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో 29 భజన బృందాలు పాల్గొనగా అలంకొండకు చెందిన అన్నపూర్ణ విశ్వేశ్వర భజన మండలి, ఉయ్యాలవాడకు చెందిన మూల పెద్దమ్మ భజన మండలి,గుర్రపాడుకు చెందిన శీలక్ష్మినరసింహస్వామి భజన మండలి, శంకరాపురానికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి, హళికెరకు చెందిన అంజనేయస్వామి భజన మండలి, పెట్నికోటకు చెందిన సీతారామాంజనేయ భక్త మండలి తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. వీరికి వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.16 వేలు నగదు బహుమతులు అందజేశారు. మొత్తం 21 బృందాలకు నగదు బహుమతి, మిగతా జట్లకు ప్రోత్సాహక బహుమతి అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామస్తులు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

నార్పల: అధైర్యపడకు అండగా ఉంటాం సిద్ధరాచర్ల సర్పంచు సాకే రామాంజనేయులుకు ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి భరోసా ఇచ్చారు. దళిత సర్పంచు సాకే రామాంజనేయులు రెండు రోజుల క్రితం జనసేన కార్యకర్త వినోద్‌కుమార్ చేతిలో దాడికి గురైన ఘటన విదితమే. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రామాంజనేయులును పరామర్శించారు. దాడికి కారణమైన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటానని రామాంజనేయులతో పాటు ఆయన కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగగేశ్వరావు, ఎంపీటీసీ శంకర్‌యాదవ్, నాయకులు వెంకటనారాయణరెడ్డి, కుళ్లాయిరెడ్డి, జానగాని శంకర్, దాము తదితరులు పాల్గొన్నారు.



సర్పంచు రామాంజనేయులును పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

తాగునీరు వృథా చేయొద్దు

యాడికి: వేసవి నేపథ్యంలో తాగునీరు వృథా చేయొద్దని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు ప్రజలకు సూచించారు. ఆదివారం చింతలాయపల్లెలో మండల పరిషత్ నిధులు రూ.1.5 లక్షలతో ఏర్పాటు చేసిన మినీట్యాంకును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నీటి ట్యాంకు నుంచి పీర్ల చావిడి వైపున ఉన్న గృహాలకు కొంత కాలం నుంచి నీరు రావటం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తెచ్చారన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలకు మేరకు మినీ ట్యాంకు ఏర్పాటు చేశామన్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేతోపాటు రమేష్‌నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంకు ప్రారంభిస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు

పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

తాడిపత్రి టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పద్మశాలీయ సామాజిక వర్గానికి చెందిన టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులు అందించనున్నారు. ఈమేరకు తాడిపత్రి వరదయ్య పద్మశాలి కమ్యూనిటీ హాల్ కమిటీ అధ్యక్షుడు వద్ది శివ సత్యనారాయణ, సభ్యులు సూర్యనారాయణ, చెన్నారాజగోపాల్, జలదుర్గం దామోదర్‌దాస్ ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతిలో 540 మార్కులు అంతకంటే ఎక్కువ మార్కులు, ఇంటర్‌లో 900 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కార అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7,500, తృతీయ బహుమతి రూ.5 వేలు, మెమొంటో, ప్రశంసాపత్రం అందించనున్నట్లు తెలిపారు. కన్సోలేషన్ బహుమతి కింద ఒక్కొక్కరికి రూ.1,000 తోపాటు ప్రశంసా పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31 లోపు శ్రీ వరదయ్య పద్మశాలి కమ్యూనిటీ హాల్ సీబీరోడ్డు తాడిపత్రి చిరునామాకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9848822112,8098985858, సంప్రదించాలని సూచించారు. జూన్ 11న అవార్డుల ప్రదానోత్సవం జరగనున్నట్లు పేర్కొన్నారు.